# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వచ్చే ఉగాది నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
- ❖ రాష్ట్రంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు కేంద్రసాయంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీకి బయలుదేరారు.
- ❖ పప్పుదినుసుల కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన చేపట్టి.. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి కె.అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.
- ❖ సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు.

========================

ఉగాదికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకువస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. రెండవ రోజు అమరావతిలో జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... మాతాశిశు మరణాల రేటును సున్నాకు తీసుకురావాలని సూచించారు. ఈ నెల 28 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో `ముస్తాబు` కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో ర్యాంకింగ్ ఇస్తామని, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాల కల్పన ముఖ్యమైన అంశాలని కలెక్టర్లకు సూచించారు. భారీ వర్షాల కారణంగా వరదతో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయే పరిస్థితి రాకుండా చూడాలని, డ్రగ్స్ లాగే పొగాకు వినియోగం తగ్గించేలా కలెక్టర్లు కృషి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు.

========================

దేశంలో మొదటిసారిగా పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతాను తీసుకువచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఎస్క్రో ఖాతాకు సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే జారీ చేస్తామని వెల్లడించారు. 'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎంపిక కావడంపై చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సదస్సులో స్పందించారు. తన సహచర మంత్రులు, అధికారులు, కలెక్టర్లల కృషి ఫలితంగానే ఈ అవార్డు లభించిందన్నారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్

బిజినెస్' విధానం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 18 నెలల్లో 25 పాలసీలను తీసుకువచ్చి పరిశ్రమలను, పెట్టుబడులను తీసుకువస్తున్నామని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

========================

రాష్ట్రంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీకి బయలుదేరారు. ఆరుగురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి రేపు సమావేశం కానున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్, పెట్రోలియం-సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి, కేంద్ర నౌకాయాన, జలరవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌తో భేటీ అవుతారు. కేంద్ర భాగస్వామ్యంతో రాష్ట్రంలో చేపట్టిన పలు ప్రాజెక్టులు, అమలు చేస్తున్న కార్యక్రమాలపై కేంద్ర మంత్రులతో చర్చిస్తారు. తిరిగి శుక్రవారం రాత్రి అమరావతి చేరుకుంటారు. శనివారం అనకాపల్లి జిల్లాలో జరిగే 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

========================

'బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎకనామిక్ టైమ్స్ ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలు, రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు గానూ... ఈ అవార్డును ముఖ్యమంత్రికి ఇస్తున్నట్టు ఎకనామిక్ టైమ్స్ ఈరోజు ప్రకటించింది. వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును చంద్రబాబు నాయుడుకు ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డును గతంలో కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్ (2024), ఎస్. జైశంకర్ (2023), నిర్మలా సీతారామన్ (2021), మహారాష్ట్ర మాజీ సీఎం దేవేంద్ర ఫడణవిస్ (2019), కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ (2017), పీయూష్ గోయల్ (2015) అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడంపై ప్రముఖులు, మంత్రి వర్గ సహచరులు ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు.

విరామం

========================

అమరావతి సచివాలయంలో రెండో రోజు జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్న కలెక్టర్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. ఈ కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ... పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి చేసిన వినూత్న ఆలోచనతో ప్రవేశపెట్టిన ''ముస్తాబు'' కార్యక్రమం తనను ఎంతో ఆకర్షించిందని పేర్కొన్నారు. నిధుల్లేకుండానే అద్భుతమైన కార్యక్రమాలు చేయవచ్చని, దీనికి ఉదాహరణ ''ముస్తాబు'' కార్యక్రమమే అని అన్నారు. వినూత్న ఆలోచనలే ముఖ్యమని, అభివృద్ధి అంటే కేవలం నిధుల కేటాయింపు మాత్రమే కాదని, ఉత్తమ విధానాలతో సంపదను సృష్టించవచ్చని అధికారులకు ముఖ్యమంత్రి సూచిస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

అలాగే విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో అమలు చేస్తున్న "సూపర్ 50 ఇన్‌స్పిరేషన్ ఇంజిన్ ఆఫ్ నిర్మాణ్" కార్యక్రమన్ని ముఖ్యమంత్రి ప్రశంశించారు. పదో తరగతి విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడానికి `మెంటారింగ్` పద్ధతిని కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ప్రవేశపెట్టారు. దీనిపై చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... విద్యా శాఖ ప్రారంభించే ఇలాంటి వినూత్న కార్యక్రమాలను జిల్లా కలెక్టర్లే స్వయంగా పర్యవేక్షించి ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

========================

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం 72.6 శాతం అక్షరాస్యత ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 81 లక్షల మంది నిరక్షరాస్యులున్నారని, వారందర్నీ వచ్చే మూడేళ్లలో అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. జిల్లాల్లో కలెక్టర్లు అక్షరాస్యత కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

=======================

ఖరీఫ్ 2025–26 సీజన్‌కు సంబంధించి పప్పుదినుసుల కొనుగోలుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి కె. అచ్చెన్నాయుడుకి ఆయన లేఖ పంపారు. లక్షా 16 వేల 690 మెట్రిక్ టన్నుల కందులు, 903 మెట్రిక్ టన్నుల పెసలు, 28 వేల 440 మెట్రిక్ టన్నుల మినుములు కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు శివరాజ్ సింగ్ చౌహాన్ ఆ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పప్పు రైతులకు గిట్టుబాటు ధర లభించనుండగా, వారి ఆదాయం పెరిగే అవకాశాలు మెరుగుపడ్డాయని మంత్రి అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో పప్పుదినుసుల కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన చేపట్టి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

=======================

పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నామని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు తెలిపారు. పార్వతీపురంలో వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ... జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో రహిత భవిష్యత్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

=======================

ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకి ఎకనమిక్ టైమ్స్ సంస్థ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారాన్ని ప్రకటించడం రాష్ట్రమంతటికీ గర్వ కారణమని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి, నవతరం భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పాలనా విధానాలు, పారిశ్రామికవృద్ధికి చేపడుతున్న సంస్కరణలు ఖచ్చితంగా సత్ఫలితాలనిస్తాయని తెలిపారు.

=======================

రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలను యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఎస్. భరణి ఈరోజు గుంటూరులో ప్రారంభించారు. 'యువ-2025' పేరిట రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కే. ఎల్. యూనివర్సిటీ వేదికగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ... యువతలో ఉన్న ప్రతిభను ప్రదర్శించడానికి సరైన వేదికను కల్పించడమే యువ 2025 ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

=======================
=======================